# అలకపాన్పు

ఓగేటి శివరామకృష్ణ

వాసు తన పెళ్ళి విషయంలో ఆసక్తి చూపక పోయేసరికి తండ్రి శ్రీమన్నారాయణకూ, తల్లి లక్ష్మీ నరసమ్మకూ ఒక్కసారి మింగేదా మన్నంత కోపం వచ్చింది.

కోపం వస్తేమాత్రం యేం చేస్తారు? అసలు వాసు అప్పటికి యిరవైయేళ్లు నెత్తిమీద కొచ్చినా నా కిప్పుడప్పుడే పెళ్ళి వద్దోయ్ అని మొత్తుకొంటున్నాడు. ఏలాగో దైవానుగ్రహంవల్ల ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోడానికి యిష్టపడ్డాడు.

పెండ్లి సంబంధం నిశ్చయమయిన రోజు నుంచీ లక్ష్మీనరసమ్మ కొడుకుతో వీలయినప్పుడల్లా "నాయనా, అలకపాన్పు సమయంలోనే నీకున్న కోరికలు తీర్చుకోవాలి, తరువాత నీకు లభించేది ఉండదు. అదే అదనున ఏదో మంచి ఖరీదుగల వస్తువు కోరుకోవాలి. అంతే కాని యేదోవస్తు వన్నానని యేభైరూపాయల రిస్టువాచీమాత్రం కోరకు." అని చెప్పేది. ముందు తా నింకా ఆడపిల్లలకు పెండ్లిండ్లు చెయ్యాలి. అవబోయే కొత్త అల్లుళ్ళందరూ తమను అలకపాన్పుమీద తలలువంచి గుంజుతారు అన్న ఉద్దేశం ఆమె మనసులో లేకపోవటంవల్ల. ఈవిధంగానే కాపురంచేస్తున్న శ్యామలా, ఫిఫ్తు ఫారం చదువుతున్న తమ్ముడూ గూడా చెప్పారు.

ఎటొచ్చీ చిన్నపిల్లలు సరోజా, చిట్టీ- కొద్ది కాలంలో వివాహం చేసుకోబోతున్న మంగా మాత్రం యేమీ అనక, అన్నయ్యచెప్పే జవాబు ఎలా ఉంటుందో అని యెదురుచూచేవారు.

వాసు కదంతా విచిత్రంగా కన్పించింది. అతడు మనస్సును ఆలోచనతో వేధించలేదు. కాని అలకపాన్పుదగ్గర తనకు కావలసిన వస్తువు కోరుకోటం, అటువయిపు వాళ్లు, అంటే తన కవబోయే మామగారివైపు వాళ్లు, తనకోరిక తీర్చటం ఆచారం అనుకొన్నాడు.

అనుకొన్నట్లుగా వివాహ మయిపోయింది. ఇక అలకపాన్పే తరువాయి.

"ఏదో నాయనా, ఏం అడుగుతావో యిదే సమయం - నీ మామగారు యేం యివ్వటానికి వాగ్దానంచేసినా, నువ్వు పుచ్చుకోడానికి ప్రయత్నంచేసినా' అని తన తల్లి తిరిగి పాట ప్రారంభించింది.

'అన్నయ్యా, ఏదయినా చక్కని విలువగల వస్తువును కోరుకోరా, ఇదే సమయం.' అని తల్లికి తోడయింది శ్యామల.

ఇలా అంతా వాసు వైపు చూచి 'యిది కోరు, అదికోరు' అని చెపుతున్నారు.

అయిన కొత్త బావమరది, అప్పుడే మంచం మీద (అదే అలకపాన్పు) కూర్చున్న తన వైపుచూచి - ఏదో కొంచెంగా గంధం, సెంటూ పామి వదలక, ఏకంగా వంటినిండా పులిమేస్తూ 'లేవయ్యా బావగారూ' అని ఒకే వరుస నంటున్నాడు.

తమతో వచ్చిన పురోహితుడు గూడా 'ఆలోచించి చెప్పు. ఈలాంటి అదను యింకోటి లేదు. నువ్వు కోరుకొనేది తప్పక యిచ్చితీరవలసిందే' అంటూ వాసును ఉద్రేకపరుస్తున్నాడు.

"ఏమి కావాలో కోరుకోవోయ్' అంటూ కొత్తమామగారు గూడా తనవైపు ఒక తీక్ష్ణమైన చూపు చూశాడు.

"నాయనా- అవతల పని దిగడింది- తొందరగా తెమల్చాలి." అంటున్నాడు ఆడపెండ్లివారి పురోహితుడు.

అంతా అలా తలోవిధంగా చెపుతున్నప్పటికీ వాసు మనస్సు మాత్రం వేరేవిధంగా నడుస్తోంది. అంతా తన్ను 'యిది కోరు', 'అది కోరు' అని చెపుతున్నారు. అవును, కోరాలి. శ్యామల పెం

డ్డికి అలకపాన్పు వద్ద తన బావను తనెంత బలవంతపరిచాడు? మొత్తంమీద బావమరది తప్పక యిస్తారన్న వాగ్దానం ముందు పుచ్చుకొని రేడియో గ్రామఫోను కోరాడు. రేడియో గ్రామఫోనుకు దగ్గర దగ్గరగా నాలుగు వందలు ఖర్చుపెట్టి యివ్వటానికి నాన్న యెంత బాధ పడ్డాడో కళ్ళారా చూచిన తనకు తెలుసు! ఇప్పుడు తాను వారిని ఏదో ఒక విలువ గల వస్తువును కోరితే తిరిగి సమయ మొచ్చినప్పుడు తన్ను అవబోయే బావమరదులు కోరకుండా ఉంటారా?

ఈ విధంగా అతని మనసు యుద్ధం చేస్తోంది. చూడ్డానికి వచ్చిన 'వాళ్ళంతా అల్లుడుగారికి చాలా కోపం వచ్చినట్లుంది- పాన్పు దిగటం లేదు' అంటున్నారు. అంతవరకూ గంధం పామటంవల్ల చేతులు నొప్పి పెట్టాయేమో బావమరిది సర్దుకొని 'ఏం కావాలో కోరుకోవయ్యా' అంటున్నాడు.

'ఏయ్, జవాబు చెప్పేదాకా పాముతోనే ఉండు' అంటూ యెవరో అధికార స్వరంలో బావమరిదితో అన్నారు. బావమరిది తిరిగి తన పని చేస్తున్నాడు. వాసు కదంతా సహించడానికి శక్యం కాకుండానే ఉంది. కాని తాను యేదో ఒక జవాబు చెప్పేదాకా బావమరది వదల్డు- ఏం చెప్పటం?

'సైకిలు అడగరా—' అంటోంది శ్యామల, వాసుకు అసలు యేం కోరుకోవలసిందీ ఆలోచన తెగలేదనే ఉద్దేశంతో—

'రేడియో గ్రామఫోను కోరుకోవోయ్—' అన్నాడు పెండ్లిచూడ్డానికి వచ్చిన ప్రాణ స్నేహితుడు.

'మంచి ఖరీదయిన రిస్టువాచీ అడుగు' అంటున్నాడు తన తాలూకు మనిషి ఒకాయన.

'ఏ మడిగినా సరే—కోరే వస్తువు నాలుగు మూడు వందలు కిమ్మత్తు చెయ్యాలి' అంటోంది ఒప్పువాచిన శ్యామల (శ్యామల మొగుడు దగ్గర దగ్గరగా 'ల' కారాని కధికారి లెండి.)

'ఏదో పెద్ద వస్తు వడుగు'- అంటోంది తల్లి యిదివరకు తాను చెప్పిన మాటలన్నీ తనకు నెమరు వేసి స్ఫురణకు తెస్తున్నట్టుగా.

'ఏమిటోయ్ నాయనా- అవతల టయిమయి పోతోంది' అంటున్నారు మామగారు తిరిగి.

'తొందరగా చెప్పవోయ్ బావా' అంటున్నాడు బావమరది.

'ఊఁ—చెప్పూ' అంటోంది తల్లి!

వాసు కింకా జవాబు దొరకలేదు! పాపం అతని మనస్సు యెందుకో బాధ పడుతోంది. దూరంగా తన చిట్టి చెల్లెలు 'మంగ' కన్పిస్తోంది. కొద్ది కాలంలో మంగకు వివాహం చెయ్యాలి. బోలెడు డబ్బు కావాలి. అప్పటికే తమ ఆస్తి అంతా సన్నగిలి పోయింది. ఆమె వివాహ సమయంలో తండ్రి యీలాటి యెన్నిటికి జవాబు చెప్పవలసివస్తుందో! పాపం, వాసు మనస్స మనస్సులో లేదు!

'ఏమోయ్!'

ఇంకా జవాబు వాసునుంచి రాలేదుకాని 'ఎందు కిదంతా' అని మాత్రం అనకలిగాడు.

'ఏదో సరదా. దానికేంగాని ముందు—' అన్నా రెవరో.

'ఆ - ఏదో మీకు తోచింది' అంటూ లేవబోయాడు వాసు.

మామగారూ, పురోహితుడూ, బావమరదీ తేలిగ్గా తెమిలిపోయిందని ఒకరివంక ఒకరు చూసుకొంటున్నారు.

'ఆ లేవకు, ఏం కావాలో అడిగి మరీకదులు' అంటున్నా రెవరో; వాసు తిరిగి కూర్చోక తప్పింది కాదు.

ఇంక రహస్యంగా కూర్చుంటే అనవసరంగా సమయం దాటిస్తున్నా డన్న ఉద్దేశం చేత కాబోలు 'ఒరే అబ్బి అల్లాకాదు—ఏదో ఖరీదు గల వస్తువును కోరు కోవాలి కాని అల్లా చెప్పితే యెల్లాగ! ఏం కోరుకుంటావో మీ మామగార్ని పిల్చి వెయ్యాలి", అంది నవ్వుతూ తల్లి.

ఈ సారి వాసులో ఓర్పు తక్కు వయి పోయింది.

"ఏడిసి నట్లేవుంది. ఇవాళ మనం యీ విధంగా కోరి వాళ్ళ నేడ్పిస్తే రేపు యిల్లాగే నిన్ను వాళ్ళేడిపిస్తారు. ఆ కోరికకు ఒక హద్దు ఉండాలి. వాళ్ళకు తోచినది వాళ్ళేయిస్తారు. నీకేం బుద్ధిలేదు" ఈ విధంగా అంటూ అలక పాన్పు మీంచి లేచిపోయాడు వాసు. రెండు వైపుల వాళ్లూ తెల్లపోయి చూస్తున్నారు.